



**మాం**చి వయసులో వున్న కుర్రాడికి యింకా మాంచి కండిషన్‌లో వున్న స్కూటర్ని నడపడంలో వున్న ఆనందం యింక దేనిలోనూ దొరకదేమో అనిపిస్తూంటుంది ఒక్కోసారి నాకు. ఫుల్‌స్పీడ్‌లో, హారన్ మీద వేలు నొక్కి పెట్టి వుంచి, అందర్నీ ఓవర్‌టేక్ చేసుకు పోతూంటే— ఓహ్— గొప్ప థ్రిల్ !!

అయిదున్నరకి బ్యాంక్ వదుల్తూనే, జానపదహీరో గుర్రం ఎక్కినట్లు స్కూటర్ మీదకు ఎగిరి కూర్చుని, కిక్ కొడుతూనే క్లచ్ వదిలి ఏక్సిలేటర్ రైజ్ చేసి, బండిని ముందుకి దూకించాను క్షణాల్లో 'అశోకా థియేటర్ చేరి, రెండు టిక్కెట్లు తీసుకుని, రూంకి పోయి ముస్తాబై 'ఫియాన్సీ'తో సినిమాకి వెళ్లాలనేది నా తొందర.

గోపాలస్వామి గుడి, ఎం.జి.ఎం. మెరుపు వేగంతో దాటేసాను. కె.ఎం.సి. చేరుతూండగా... అదిగో... అక్కడ పడిందయ్యా బ్రేకు...నా స్కూటరు స్పీడుకి, నాలోని ఉత్సాహానికీ .

ఒక 'తాను' కాకీ ప్యాంటులో రెండు తాన్ల తెల్లచొక్కా కుక్కి, నాలుగంగుళాల వెడల్పు బెల్టుతో, వాటిని బిగించిన లావుపాటి నల్ల మీసాల పోలీసు— నా స్కూటర్‌కి అడ్డువస్తూ, చెయ్యి వూపుతున్నాడు 'ఆప'మన్నట్లుగా.

గొప్ప నిస్పృహ ఆవహించేసింది నన్ను— అంతకుమించి విపరీతమయిన కోపం కమ్మేసింది కూడా. బక్కపలచటి వాడో, ఓ మోస్తరు పెర్సనాలిటీయో అయితే నిస్సంకోచంగా గుద్దిం చేసి, ముందుకు దూసుకుపోయే వాణ్ణే—ఏమయితే అవుతుందని. కాని... కొండంత ఆకారం — చూస్తూ చూస్తూ... హమ్మో!! నా ముద్దుల స్కూటరూ, నేనూ... నామరూపాలు లేకుండా పిండి అయిపోమూ ?!

కానీ, బండిలైసెన్సు గాని, డ్రైవింగు లైసెన్సుగాని, ఏవీ దగ్గర లేవు. అందులో యితగాడు పరమ కర్కోటకుడనీ, జేబులు ఖాళీ చేసిగాని వదలడని విన్నాను చాలామంది చెబితే. ఏందారి? ... ఆలోచించేంత టైమూ లేదు... ఇంకొంత ముందే గమనించి వుంటే...లెఫ్ట్‌టర్న్ తీసుకుని వేరే దారి పట్టించే వాడిని... ఖర్మరా నాయనా... !!

'కీచు'మని బ్రేకు నొక్కుతూ, అతగాడి ముందు ఆపాను బండిని— దడదడలాడే గుండెతో, నేరస్థుడిలా చూస్తూ.

''చౌరస్తా దాకా లిఫ్టు గావాలె సార్''

ఉలిక్కిపడ్డాను! నా చెవుల్ని నేనే నమ్మలేక పోయాను !

''ఏంటండీ...?'' అన్నాను— మళ్ళీ ఆ అమృతపు పలుకుల్ని రిపీట్ చెయ్యమన్నట్లుగా—

''అమ్మగొండ చౌరస్తాదాకా...'' తర్వాత అక్షరాలు అతని మృదు మధురమయిన గరగర గొంతుతో ఉచ్చరించాడు గాని, ఆనందంతో ఉబ్బితబ్బిబ్బవుతూన్న నాకు వినిపించలేదు— వినాల్సిన అవసరమూ లేదు.

''వెల్‌కమ్— రండ్రండ''న్నాను ఉత్సాహంగా.

చిరునవ్వు చిందించి, తన ఏభయికిలోల కుడి కాలుని నాలుగు కిలోల బూటుతో సహా ఎత్తి, స్టెప్నీ మీదుగా సర్కస్ వాళ్ల పెర్పెండిక్యులర్ యాంటీ క్లాక్ వైజ్‌గా తిప్పి, నెమ్మదిగా స్కూటర్‌కి రెండో వైపు నేలకాన్చి, 'హూం' అంటూ సీటుమీద స్టెప్నీకి నాకు మధ్య కూరుకు కూలబడేసరికి, నేను ఆరంగుళాలు ముందుకు నెట్టబడటం, ముందు చక్రం మొండికెత్తిన గుర్రంలా పైకి లేవడం ఒక్కసారే జరిగాయి. గాభరా పడుతూనే ఎంతో సమయస్ఫూర్తిగా రెండు కాళ్లూ బలంగా నేలకాన్చి, శక్తంతా చేతుల్లోకి తెచ్చుకుని, గుండెలనిండా ఊపిరిపీల్చి హ్యాండిల్ క్రిందికి అదిమి, బండిని కంట్రోల్ లోకి తెచ్చుకుని, 'ఒక్క రెండు కిలోమీటర్లు భారం మోసి, నా పరువు నిలబెట్టవే బంగారు తల్లీ' అని బ్రతిమాలి, 'రేపు నీకు అభ్యంగన స్నానం చేయించి, ఆయిల్ పెట్టించి, పాలిష్ కొట్టించి, ముస్తాబు చేస్తా'గా' అని ఆశపెట్టి, గేర్‌లో వేసి, క్లచ్ వదిలాను... ఉహూఁ... కదల్దే !! ఏమయితే అయ్యిందని థ్రాటిల్ ఫుల్‌గా తిప్పి, ఒక్కసారిగా క్లచ్ వదిలిపెట్టాను... అప్పుడు కదిలింది గునుస్తూ. అంత రైజ్ చేస్తే వంద కిలోమీటర్ల స్పీడులో వెళ్లాల్సిన బండి అయిదు కిలోమీటర్ల స్పీడులో ఒణుకుతూ నడుస్తోంది. నా సీటులో కూడా మూడొంతులు అతగాడే ఆక్రమించేసుకోవడంతో మిగిలిన కొద్ది స్థలంలోనూ కూర్చోవడమే ఇబ్బందిగా వుంది. పైగా అతగాడి బెల్టు నా వెన్నుపూసకి కుదువు వున్నప్పుడల్లా గుచ్చుకుని, యమబాధపెడ్తోంది—

ఎలాగో సర్దుకుని, జాగర్తగా నడుపు తున్నాను, కష్టపడుతూనే.

అయితే— మానసికంగా చాలా ఆనందంగా వుంది నాకు. చెకింగ్ కోసం ఆపాడని భయపడు తూన్న నన్నే లిఫ్టు కోసం రిక్వెస్టు చేసాడంటే ఆనందంకాదూ మరి ? ఇహ నేను ఇతగాడి లైన్లో వున్నంతకాలం లైసెన్స్‌ల గురించి భయ పడనక్కర్లేదు. హాయిగా, ఝూంమ్మని దూసుకు పోతూండొచ్చు. నా అదృష్టం కాకపోతే నా స్కూటరే ఇతన్ని ఆకర్షించాలా ?

బొత్తిగా కండోలెన్స్ మీటింగ్‌కి వెళ్తొన్నట్లు మౌనంగా వుండటం యిష్టంలేక, "మీ పేరేవిఁటండీ?" అని పలకరించాను.

"ఈఁరాసాఁవిఁ" అన్నాడు.

నా పేరూ అడుగుతాడనుకున్నాను. అడగ లేదు. నేనే చెప్పేద్దామనుకుంటూండగా, "కొలు వేడసార్ తవఁది?" అన్నాడు.

'బుద్ధి పోనిచ్చుకున్నావు కాదుకదా– పేరడక్కుండా వుద్యోగం అడుగుతున్నావా' అనుకుని చెప్పాను.

"బేంకులోవా సార్" అంటూ కాద్ది ఆనందాన్ని ప్రకటించి, ఎదో ఆలోచనలోపడ్డాడు.

అవునన్నట్లు తలూపి, "ఎప్పుడన్నా మా బ్యాంకుకి పని పడి వస్తే నన్ను కలవండి" అన్నాను.

"గట్లనే సర్ గట్లనే..." అంటూండగా. అతగాడి దృష్టిలో ఎవరో పడ్డట్లున్నారు, "జర అవ్రని... జర అవ్రని బాజూల..." అన్నాడు ఎడమ ప్రక్కకి చెయ్యి చాపి. ఆ దిక్కు వంగుతూ. ఒక్కసారిగా అతగాడలా వంగేసరికి, ఆటు వైపు ఒరిగిపోతున్న బండిని కాలు నేల కాన్చి కంట్రోల్ చేసుకుంటూ ఆపాను.

స్కూటర్ దిగకుండానే రోడ్డువారగా మూలకి వున్న పాన్‌షాప్ వైపు చూస్తూ, "సార్" అని పిలుస్తూ, చప్పట్లు కొట్టాడు వీరాస్వామి.

ఆటు సారించిన నా చూపులో ఒక ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పడేసరికి మళ్ళీ భయం మొద లయ్యింది– 'ఇదేవిఁట్రా దేవుడా, కొంపమునగ బోతుంది కాబోసు' అని.

వీరాస్వామిని చూస్తూనే ఇన్‌స్పెక్టర్ ఉత్సాహంగా వచ్చాడు.

"సార్– గీసార్‌కి బేంకిల కొలువంట. లోన్ గావలెనన్నరు గంద గప్పుడు?" అన్నాడు వీరా స్వామి. అవునన్నట్లుగా తల వూపి, చిరునవ్వుతో నాతో చెయ్యికలిపి, తన పేరు, కావల్సిన లోన్ విషయాలు రెండు నిమిషాలు మాట్లాడాడు ఇన్ స్పెక్టర్. వీలునిబట్టి బ్యాంకుకి రమ్మన్నాను ఆనందంగా, రీవిగా.

మళ్ళీ బండి కదిలింది. వీరాస్వామి మీద నా మనస్సు కృతజ్ఞతతో నిండిపోయింది– ఇన్ స్పెక్టర్‌ని కూడా పరిచయం చేసినందుకు.

"ఎన్నడన్నా పోలీసులతో గిట్ల ప్రాబ్ల మొస్తే నా పేరుగాని, మా సార్ పేరుగాని జెప్పవ్రని– ఏంగాదు" అన్నాడు వీరాస్వామి నా చెవిలో.

'ఆనందంలో ఉక్కిరి బిక్కిరిచేసి ఒక్క సారిగా చంపెయ్యకయ్యా బాబూ' అనుకున్నాను లోలోనే.

"థేంక్సు సార్" అన్నాడు చౌరస్తాలో దిగిపోయి. సెల్యూట్ కొట్టి.

"వెల్‌కమ్" అంటూ చేటంత అయిన నా మొహాన్ని అతను బాగా గుర్తుపెట్టుకునేలా అతని వైపు తిరిగి, చిరునవ్వు చిందించి, ముందుకు కదిలించాను బండిని. మెరుపువేగంతో సాగి, హాలు దగ్గర ఆగింది బండి.

రెండు టిక్కెట్లు కాదు, మొత్తం టిక్కెట్లన్నీ కొనేసి, అందరికీ పంచిపెట్టించా లన్నంత ఆనందంగా వుంది.

'ఇంత కొద్దిదూరం లిఫ్టుకే తన పేరుని అవసరానికి ఉపయోగించుకోమంటున్న వీరాస్వామి నిజంగా కృతజ్ఞత అంటే ఏమిటో తెలుసున్న వాడు' అనుకుంటూ, టిక్కెట్ల డబ్బుకోసం పర్సు తీద్దామని, బ్యాక్ పాకెట్‌లో చెయ్యి పెట్టి, ...

— గతుక్కుమన్నాను !

గబగబా అన్ని జేబులూ వెతికాను...

— అదిరిపడ్డాను !!

... లేదు... పర్సు లేదు...

...పోయింది... అందులో వంద రూపా యలదాకా వున్నాయి... పోయాయి... కాదు... కొట్టేసాడు... వీరాస్వామిగాడు...

.. 'అమ్మ దొంగ గాడిద కొ... !!!' □

